# కార్పొరేటు సామాజిక బాధ్యత ప్రహసనం

**కంపెనీ** చట్టం-2013 ప్రకారం, నిర్దిష్ట శ్రేణిలోని కంపెనీలు తమ సాంవత్సరిక నికర లాభాలనుండి కనీసం 2 శాతం కార్పొరేటు సామాజిక బాధ్యత(సిఎస్ఆర్) క్రింద ఖర్చు చేయాలి. ఈ ఖర్చుతో చేబట్టిన కార్యక్రమాలు, ఆ ఖర్చుల వివరాలను ఖచ్చితంగా వెల్లడి చేయాలి. సామాజిక సంపదకు ధర్మకర్తలుగా వ్యవహరించే కార్పొరేట్ల సంస్థను నిర్మించే లక్ష్యంతో ఈ విధానం చేపట్టామని చెబుతున్నారు.

ఈవిధమైన పదాడంబర బడాయి నినాదాలతో, బడాపెట్టుబడిదారులకు దాసోహ మైవున్న కార్పొరేట్లు మరియు పాలకులు ప్రజలను మోసగిస్తూ వున్నారు. ఒకవైపున సామ్రాజ్యవాద బహుళజాతి కార్పొరేషన్లద్వారా అంతులేని మనదేశ సంపదను నిరభ్యంతరంగా లూటీ చేసుకుపోతూనే, మరోవైపున ఈ కార్పొరేట్లు, బడావాణిజ్య సంస్థలు ప్రజల సంక్షేమం, వారి సామాజిక బాధ్యతను స్వీకరించాయని పేర్కొంటూ వంచన చేస్తున్నారు.

మనదేశంలో 2015-2017 సం॥లలో కార్పొరేటు సామాజిక బాధ్యతపై సాగించిన ఇటీవలి ఓ అధ్యయనం - కార్పొరేటు పాలన గురించి, కార్పొరేటు సామాజిక బాధ్యత సుగుణాల గురించి స్వార్ధపరశక్తులు సాగించే ప్రచారం మిధ్య అని వెల్లడిచేసింది. భారత దేశంలో కార్పొరేటు సామాజిక బాధ్యతపై చేసే వ్యయం గురించి బిజినెస్ స్కూల్ ఆఫ్ థామస్ ష్మిడ్థెనీ సెంటర్ అధ్యయనం చేసి, వ్యాపార వాణిజ్య సంస్థల సిఎస్ఆర్ కార్యక్రమాలు నామమాత్రమైనవని, ఏమాత్రం ప్రయోజనకరం కావని వెల్లడి చేసింది.

ఈ అధ్యయనం ప్రకారం కుటుంబ సంస్థలుగావున్న కంపెనీలలో కేవలం 50శాతం మాత్రమే నిర్దేశిత మొత్తాన్ని వెచ్చించి వారి సిఎస్ఆర్ కార్యమ్రాలు సాగిస్తూ వుండగా, 45.1శాతం కుటుంబేతర సంస్థలు సిఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టగా, కేవలం 31.7 శాతం రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు మాత్రమే ఈ కార్యక్రమాలు చేపట్టాయి. ఈ పాటి కార్యక్రమాల నిర్వహణ లోనూ పారదర్శకత లోపించటంతోపాటు, సమర్ధ నిర్వహణా యంత్రాంగం కూడా లేకుండా వుంది.

బడావ్యాపార వాణిజ్య సంస్థలు కొద్దిపాటి డబ్బు వెచ్చించి నిర్వహించే ఈ సిఎస్ఆర్ కార్యకలాపాలు కూడా చాలా లోపభూయిష్టంగా వున్నాయని మరో అధ్యయనం వెల్లడిచేసింది. సిఎస్ఆర్ పేరుతో ఖర్చుచేసే డబ్బులో అత్యధిక శాతం పాలకవర్గ రాజకీయపార్టీలకు విరాళాల రూపంలో ఖర్చుపెడుతున్నారు. మరో మాటల్లో చెప్పాలంటే, బడా వ్యాపార వాణిజ్యవర్గాలు నిర్వహించే సిఎస్ఆర్ కార్యక్రమాలు అంటే సమాజానికి, దాని నిజమైన అవసరాలకు ఎలాంటి సంబంధంలేనిదని తేటతెల్లమౌతోంది.

ఆచరణలో సిఎస్ఆర్ ఓ ప్రహసనంగా మిగిలిపోయింది. సమాజంలో సంక్షేమం చేకూర్చటం, సమాజ సంపదకు ధర్మకర్తగా వ్యవహరించటం వంటివన్నీ మిధ్య మాత్రమే. యావత్ ప్రపంచాన్నీ లూటీచేసుకునే బడా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద బహుళజాతి కార్పొరేషన్ల ఎడల ప్రపంచ ప్రజలకు సద్భావన సృష్టించి, వారిని నిలువునా ఉద్దేశపూర్వకంగా మోసగించటానికి వుద్దేశించినదే ఇది. ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడిదారీ దోపిడీ, లూటీలను పరిరక్షించి, సమర్ధించి, ఆమోదించే నయా ఉదారవాద ఆర్ధికవ్యవస్థ సృష్టించినవే ఇవన్నీ.

పెట్టుబడిదారీ వ్యవస్థ సుగుణాల గురించి ఇంకా భ్రమలు వున్నవారికి, ఈ వాస్తవాలతో నైనా కళ్ళు తెరిపిళ్ళుపడ్తాయా?!

ooooo